# స్వామీజీ

భీమవరం నుండి ఆ రాత్రి బండికే తిరిగి వచ్చేశాను.

"మీ వర్ధనత్తయ్య ఏమంది.....?" అమ్మ ప్రశ్నించింది.

"ఆలోచించి కబురు చేస్తానంది" అన్నాను.

నే చెప్పింది నిజం కాదు. అత్తయ్యపై బోలెడరీత ఆశ పెట్టుకొన్న అమ్మను నిరాశపరచలేక అలా చెప్పాను.

అసలు నిజం - "నీవు చెప్పిన అంకెకు మీ మామయ్య ససేమిరా అంటున్నారు రా!" అంది అత్తయ్య.

ఆ ససేమిరా మామయ్యది కాదని నాకు తెలుసు. "అంతేనా అత్తయ్యా!" అన్నాను.

ఆమె సుతారంగా ఊగుతున్న ఊయల బల్ల ప్రక్కన నిలువబడి - "అవునురా. మరి అంత డొనేషను పోసి వాడికి ఇంజనీరింగ్ చెప్పించారా; మీ మామయ్య మరో అంత పోసి లక్షణమైన ఉద్యోగం వేయించారా; అంతో ఇంతో ఆస్తిపాస్తులు కూడకట్టారాయె. వాడొక్కడు, చూస్తూ చూస్తూ ఇంత తక్కువ కట్నం తీసుకొంటే నలుగురిలో ఆయనకు ఎంత చిన్నతనంగా ఉంటుందో చెప్పు" అన్న అత్తయ్యతో - ఆపై పైసా కూడా ఎక్కువ ఇవ్వగల శక్తి లేదని తెలిసి కూడా - "మామయ్య ఏ మాత్రం కావాలంటున్నారు?" అని అడిగాను.

అదెంతో చెప్పింది అత్తయ్య.

మా కుటుంబంలోని వారినందరినీ విడి విడిగానో, లేక కలిపి ఏక మొత్తంగానో

బానిసలుగా అమ్మివేసినా అందులో సగం రాదు.

"అరేయ్..... బాచీ! ఒక్క మాట చెపుతా విను. నీవా తలకు మించి కట్నా లిచ్చి దానికి పెండ్లి చేయలేవు. స్థాయికి మించిన సంబంధాల వెంట తిరుగుతూ ఇలా కాలక్షేపం చేస్తూ ఉండిపోయావో... దానికి వయసు పండిపోతుంది. ఆ తర్వాత శాశ్వతంగా నీ ఇంటనే ఉండిపోతుంది. కాబట్టి, నామాట విని ఏ రెండో పెళ్లి వాడికో కట్టబెట్టి చేతులు దులిపేసుకో" అంటూ, గతించిన తన సోదరుని సంతానమైన మా పట్ల తన కున్న బాధ్యతను చంపుకోలేకన్నట్లు ఓ ఉచిత సలహా నిచ్చింది అత్తయ్య.

అత్తయ్య ఇచ్చిన ఈ సలహాను నాన్నగారు ఆమె పట్ల ఆచరించే ఉంటే - అత్తయ్య ఈనాడిలా, ఈ స్థితిలో ఆ ఉయ్యాల బల్లపైనా, మేం ఇలా ఉత్తి నేలపైన ఉండేవాళ్లమా? అత్తయ్య పెండ్లి కోసం మా పల్లెలోని ఆరెకరాల వల్లపు చేను అమ్మి, ఇంకా అప్పు చేశారట నాన్నగారు. ఆ అప్పు మిగిలిన మొత్తం ఆస్తినీ మింగేసింది ఆ తర్వాత.

మరునాటి సాయంత్రాని కల్లా - వర్ధనత్తయ్య తొంటి చెయ్యి చూపిందనే విషయం అమ్మకు నెమ్మదిగా చెప్పాను.

"మీ నాన్నగారు..... అమ్మా వర్ధనీ..... అమ్మా వర్ధనీ... అంటూ ఎంత కలవరించే వారో..... నాలుగు రోజులు చూడకుంటే చాలు, మా చెల్లి ఎలా ఉందో అనుకొంటూ రెక్కలు కట్టుకొని వెళ్ళి చూసి వచ్చేవారు. ఆ అన్నయ్యను గుర్తుంచు కోక పోతుందా మీ అత్తయ్య అనుకొన్నాను" అంటూ నిట్టూర్చింది అమ్మ.

ఈ సంఘ గమనం, బంధుత్వాలు, మమతలు, అనురాగాలు, కృతజ్ఞతలు అనే మైలు రాళ్లను దాటి ఆర్థిక విలువల కీకారణ్యాలలోకి చేరుకొన్న సత్యం అమ్మ కింకా అవగతం కాలేదు.

గదిలో కూర్చొని ఏవో ఆఫీసు కాగితాలు చూచుకొంటున్నాను. చాలా పొద్దు పోయిందిలా ఉంది. "ఇంకా నిద్రపోలేదా, నాయనా?" అంటూ వచ్చింది గదిలోకి అమ్మ. ఏమిటి అన్నట్లు చూశాను.

ఎదురుగా ఉన్న బల్లమీద కూర్చొంటూ - "ఎవరో స్వామీజీ శంకర మఠానికి వచ్చారట. నాలుగు రోజులుగా తీర్థ ప్రజల్లా జనం వెళ్లి వస్తున్నారు" అంది.

ప్రొద్దున రైలు స్టేషనులో "శ్రీశ్రీశ్రీ జ్ఞాన సచ్చిదానంద సరస్వతీ యతీంద్రుల ఆగమనం'' అంటూ పెద్ద పెద్ద వాల్ పోస్టర్సు చూచిన విషయం జ్ఞాపకానికి వచ్చింది. నాలుగు రోడ్ల కూడలిలో కూడా కాషాయపు గుడ్డలపై వారికి స్వాగత వచనాలు వ్రాసి కట్టబడి ఉన్నాయి.

"రేపొకసారి గాయత్రిని తీసుకొని వెళ్ళి వారి దర్శనం చేసుకొని రావాలని ఉంది."

"ఎందుకు." ప్రశ్నించాను.

"అయిదు సంవత్సరాలుగా నీవు తిరగని చోటు లేదు. చూడని సంబంధం లేదు. ఏం! దానికి ఏం లోటని? లక్షణమైన పిల్ల. బి.ఏ. చదువుకొన్నది. కన్నొంకరా, కాలొంకరా? ఒక్క సంబంధమూ కలిసి రావటం లేదు. ఏమిటో నాయనా! నాకు దాన్నో ఇంటికి పంపగలమా అనే ఆశ నానాటికి సన్నగిల్లుతోంది. మన ప్రయత్నాలు ఎలాగూ కలసి రావటం లేదు. ఇక ఏ మహానుభావుని ఆశీర్వాద బలమో ఫలిస్తే కాని...."

స్వామీజీల ఆశీర్వాదాలతో సమస్యలు మంచు పొగలా తొలగి తీరిపోవటం సగటు మనిషిలోని పగటి కల. అమ్మ కూడా అదే కల కంటోంది. నా నమ్మకాలను, సిద్ధాంతాలను వాళ్ల మీద రుద్దటమెందుకు అనిపించింది, "వెళ్లి రండి" అన్నాను.

"అది నీ చెల్లెలు. తాను రాదట. స్వామీజీలు, వారి ఆశీస్సులు వట్టి బూటకం అంటోంది."

"అయితే నేనేం చేయను?''

"నీవు బయలుదేరితే తానూ మాట్లాడక బయలు దేరుతుంది. ఈ ఒక్కసారికి నా మాట విని, నా తృప్తి కోసం...."

నవ్వి ఊరుకొన్నాను. నేను విశ్వసించని దాన్ని చేయించటం కష్టమని అమ్మకు తెలుసు.

ఉదయాన ఆఫీసుకు బయలుదేరబోతుండగా - "పోనీ! అత్తయ్యగారిని తృప్తి పరచి నట్లైన ఉంటుంది. సాయంత్రం ఓసారి శంకర మఠానికి వెళ్లి వస్తేనో?" అంది జానకి.

"ఏమిటి, నీకూ స్వామీజీ విభూతి స్వీకరించాలనిపిస్తోందా?"

"అత్తయ్యగారు చాలా వ్యాకుల పడుతున్నారు. పోనీ ఒక్కసారి ఆమెగారి కోసం...."

జానకికి సమాధానం చెప్పకుండా సైకిలెక్కాను. ఆఫీసంతా నిర్మానుష్యంగా ఉంది. అటెండరు హుస్సేన్ ఒక్కడే కనిపించి - "అయ్యగారింట్లో ఎవరో స్వామిగారికి పాద పూజట, సార్! అంతా వెళ్లారు" అని చెప్పాడు.

నా టేబుల్ మీదా కనిపించిందో ఆహ్వాన పత్రిక. ఉదయం 11 గంటలకు 'శ్రీశ్రీశ్రీ జ్ఞాన సచ్చిదానంద సరస్వతీ యతీంద్రుల' వారికి పాద పూజా కార్యక్రమం. తీర్థ ప్రసాదాలను స్వీకరించటానికి రమ్మంటూ, మా ఇంజనీరు వారి ఆహ్వానం.

కంట్రాక్టర్ల నుండి పెద్ద మొత్తాలలో రాబట్టిన నల్ల ధనాన్ని దాచుకొనే 'యుక్తి' మార్గాన్ని ఆశించి స్వామీజీకి పాద పూజ చేస్తున్నట్లుంది మా ఎస్.ఇ. గారు. మరో గంటకల్లా ఇంజనీరుగారి బంగ్లాకు వెళ్లిన బలగమంతా తిరిగి వచ్చారు.

స్వామీజీ పాద పూజ జరిపించుకోలేదట. పట్టు మంటే పది నిమిషాలే అక్కడ ఉండి తిరిగి వెళ్లారట. ఆ ఉన్న కాస్త వ్యవధిలో అక్కడ చేరిన వారి నుద్దేశించి 'సత్య, ధర్మాలను ఎలా అనుసరించి ఆచరించాలి' అనే విషయం చాలా సూటిగా ప్రవచించారట.

"స్వామీజీ అంటే ఎంతటి వృద్ధులో అనుకొన్నాను! చాలా చిన్నవారే" అంది టైపిస్టు వకుళ.

"కారణ జన్మలలాగే ఉంటారు" వ్యాఖ్యానించాడు, అకౌంటెంటు తిరువెంగళాచారి.

"ఆయన కనులలో ఎంతటి ప్రశాంతత! బుద్ధుడు, జీసస్ క్రైస్టు, పరమశివుడు ఏకీకృత మూర్తి ధరించినట్లు... ఆయనే ఓ మానిఫెస్టేషన్ ఆఫ్ పీస్‌లా అనిపించారు" అన్నారు ఆఫీసు మానేజరు లోకనాథంగారు.

లోకనాథంగారంటే నాకు గౌరవం. స్వామీజీ పట్ల ఆయనగారి అభిప్రాయం విన్నాక నాలో అదో విధమైన ఉత్సుకత పొడ చూపింది. లంచ్ అవర్‌లో లోకనాథంగారి గదిలోకి వెళ్లి - "ఈ స్వామీజీస్ అంతా ఓ ఫ్రాడ్ కాదంటారా?" అని ప్రశ్నించాను.

"చూడు, భాస్కరం! నీ అభిప్రాయాలు నాకు తెలుసు, ఆ అభిప్రాయాల వెనుక ఉన్న నీ నిజాయితీ కూడా తెలుసు. అయినా, నీ కభ్యంతరం లేకుంటే, ఈ స్వామీజీ నొక్కసారి చూడు" అన్నారాయన.

సాయంత్రానికల్లా స్వామీజీగారిని గురించి మరికొంత సమాచారం తెలిసింది.

ఆయనగారు మరో వారం రోజులుంటారట ఈ పట్టణంలో. శంకర మఠానికి అతి చేరువలో ఉన్న సుప్రసిద్ధ పొగాకు వ్యాపారవేత్త త్రయంబకంగారి గెస్టు హౌస్‌లో బస చేసి ఉన్నారాయన, శిష్యగణంతో. ప్రతి రోజు సాయంత్రం శంకర మఠం ముందున్న ప్రాంగణంలో ఓ గంట వారి ధర్మ ప్రవచనం జరుగుతుంది. భక్తులతో ఆ ప్రాంగణం, పరిసరాలు క్రిక్కిరిసిపోతాయి. ఆ స్థలం చాలక బయట వీధులలో కూడా జనం నిలువబడి పోవటంతో ట్రాఫిక్ కంట్రోలు కాక పోలీసులు తలమునకలౌతున్నారు. గత సాయంత్రమైతే ట్రాఫిక్‌ను దారి మళ్లించవలసి వచ్చిందట.

మరో ముఖ్య విషయం! ప్రతి ఉపన్యాసానంతరం స్వామీజీ జనం మధ్యగా దారి చేసుకొని అందరికీ తన దర్శనం అయ్యేలా నడచుకొంటూ కలయ తిరుగుతారు. అలా కలయతిరుగుతూ, ఆ జన వాహిని నుండి ఎవరినో తనతో రమ్మని సంజ్ఞ చేస్తారు. అలాంటి వారికి, ఆ సభానంతరం వారి ఏకాంత మందిరంలో దర్శనం లభిస్తుంది. అలా అనుగ్రహం పొందినవారు రోజుకు ఒకరు కావచ్చు, ఇద్దరు కావచ్చు. కాని ఆ సంఖ్య ఏనాడూ మూడు దాటదట.

అలా స్వామి వారి ఏకాంత దర్శనం పొందిన వారిలో - శంకరమఠం ముందు చెప్పుల కాపలా కాచే చెన్నయ్య మొదలు, రాష్ట్ర కిరాణా హోల్ సేలు మర్చెంట్సు అసోసియేషన్ అధ్యక్షుడు కాశయ్య వరకు వివిధ స్థాయిలవారున్నారు.

అలా స్వామివారి పిలుపు నందుకొన్న వారందరు శ్రీవారి దర్శనా నంతరం వారి వారి అనుభవాలను, అనుభూతులను కథలు కథలుగా ఏకరువు పెడుతున్నారు. ఆ చిన్మయానందస్వరూపుని సమక్షంలో తామెంత దివ్యానుభూతి పొందిందీ ఒకరు చెపితే, మరొకరు తాము స్వామివారి దర్శనానంతరం ఎంతటి శారీరక, మానసిక బాధల నుండి అతి శీఘ్రంగా విముక్తి పొందిందీ వివరిస్తున్నారట. పెను తుపాను తాకిడికి తలక్రిందులవుతున్న తమ ఆర్థిక నౌక, స్వామివారి ఆశీర్వాద

బలంతో ఎలా తట్టుకొని నిలబడగలిగిందీ - మరి కొందరు.

ఆరు నెలలు క్రిందట తప్పిపోయి, 'ఇక దొరకడు' అనుకున్న సిమెంట్ ఫ్యాక్టరీ మేనేజింగ్ పార్టనర్ దత్తాత్రేయులుగారి మనుమడు ఆయనకు స్వామి వారి దర్శనం అయిన మరునాడు కర్నాటక రాష్ట్ర పోలీసులకు ఎక్కడో దొరికినట్లు వైర్‌లెస్ వార్త రావడం; దేశంలోని అన్ని ఆస్పత్రులలో 'లాభం లేదు' అని ప్రకటించిన జిల్లా కలెక్టరుగారి సతీమణిగారి ఆరోగ్యం స్వామి వారి సంకల్ప బలంతో ఇట్టే కుదుట పడడం.... ఇలా ఎన్నెన్నో దృష్టాంతరాలట....

ఆఫీసు నుండి ఇంటికి తిరిగి వచ్చేపాటికి అమ్మ, జానకి, గాయత్రి శంకర మఠానికి బయలుదేరి నా రాక కోసం ఎదురు చూస్తున్నారు. ఇంతటి ఆర్భాటం జరుపుకుంటున్న స్వామీజీ బండారమేమిటో చూడాల్సిందే అనిపించి వాళ్ళతో బయలుదేరాను.

అప్పటికే సభ ప్రారంభమవడం...... ఆ ప్రాంగణమంతా నిండిపోవడం జరిగింది. దూరంగా ఉండి పోవలసి వచ్చింది. ఆ ప్రజా సందోహాన్ని ఒక క్రమ పద్ధతిలో కూర్చో పెట్టడానికి ఎంతో మంది వాలంటీర్లు; వారు కాక పోలీసులు.

వేదిక మీద జిగేలుమంటున్న నియాన్ లైట్ల కాంతిలో స్వామీజీ 'మూర్తి' కనిపిస్తోంది. మైకులో మాటలు వినిపిస్తున్నాయి. ఎంతో నిశ్శబ్దంగా, శ్రద్ధగా వింటున్నారు స్వామి వారి ఉపన్యాసాన్ని. సమాజం పట్ల వ్యక్తి ధర్మాన్ని గురించి చెపుతున్నారు స్వామీజీ. వేదాలను, ఉపనిషత్తులను, భగవద్గీతను ఉదహరిస్తున్నారు. మధ్య మధ్యలో ఇంగ్లీషు, హిందీలలో కూడా అనర్గళంగా మాట్లాడుతున్నారు.

స్వామీజి ప్రవచన సారాంశం కంటే ఆ చెప్పే విధానంలోని దేదో నన్ను ఆకర్షించింది. ఆ స్వరం అతి సన్నిహితమైనట్లు..... ఎక్కడో విన్నట్లు ఒక విచిత్రమైన అనుభూతి!

నాకు తెలియకుండానే ఆయన్ను దగ్గర నుండి చూడాలనే అసంకల్పమైన కోరిక నన్ను చుట్టుముట్టుతోంది.

స్వామీజీ ఉపన్యాసం ముగిసింది. ఆయనగారు జనం మధ్యలో వాలంటీర్లు ముందు నడుస్తూ దారి చేస్తూ ఉండగా నడచి వస్తున్నారు. ఆయన పాదాలపై సాష్టాంగ పడాలని, వారిని తాకి పరవశించాలని కొందరు భక్తులు ప్రయత్నిస్తూ

ఉంటే, స్వామీజీ సూచనల మేరకు అలాంటి వారిని వాలంటీర్లు వారించి, వెనక్కు లాగివేస్తున్నారు. స్వామీజీ మాకు దగ్గరగా వచ్చేసరికి ఒకరిద్దరు ఆయనకు, నాకు అడ్డుగా ఉండడంతో ఆయనను చూడ్డానికి లేచి నిల్చొన్నాను.

ఒక్కసారి శరీరం సంభ్రమాశ్చర్యాలతో జలదరించినట్లయి మ్రాన్పడి పోయాను. ముకుళిత హస్తాలతో ప్రశాంత వదనంతో, స్వామీజీ కాదు..... కాదు.... శంకరం!

కనురెప్ప లల్లార్చి మళ్ళీ మళ్ళీ చూశాను...

అవును.... శంకరమే! పది సంవత్సరాలనాడు కనిపించకుండాపోయిన శంకరమే! కాకుంటే వేష ధారణలో మార్పు - లావెక్కాడు. పచ్చని పసిమి రంగు వచ్చాడు. గడ్డం పెరిగింది. ఎన్ని మార్పులున్నా.... ఎవరినైనా ఏ మార్చగలడేమో కాని శంకరం నా కన్ను కప్పలేడు.

నా కతి చేరువలోకి వచ్చాడు. నా కభిముఖం అయ్యాడు. నిశితంగా తనను చూస్తున్న నాపై, స్వామీజీ - కాదు శంకరం చూపులు క్షణ కాలం నిలిచాయి. పూర్తి క్షణ కాలం నిలచాయో లేదో..... నన్ను దాటి వెళ్ళిపోయాడు.

నాలో ఏదో ఉద్వేగం..... నా కనుల ముందు ఓ పచ్చి మోసం, దగా జరుగు తుంటే సహించలేని ఆగ్రహం!

కాని అంతలోనే వాలంటీర్ల మధ్య నుండి స్వామీజీ శిష్యుడొకడు వచ్చి - "మీరు స్వామీజీ ఏకాంత దర్శనానికి అనుమతి పొందారు రండి" అంటూ నా చేతిని పుచ్చుకుని ఆ జనం మధ్యగా నడిపించుకుని వెళ్ళడం ప్రారంభించాడు.

క్షణ కాలం తిరస్కరించాలనే ఆలోచన వచ్చింది. దూరం నుండి అమ్మ, జానకి, గాయత్రి నన్ను చూస్తున్నారు. వాళ్ళేమిటి అక్కడి ప్రతివారు సాక్షాత్తూ విష్ణు దూతలు వచ్చి సగౌరవంగా పుష్పక విమానంలో ఒక పరమ భాగవతోత్తముణ్ణి స్వర్గధామానికి తీసుకుని వెళుతున్న దృశ్యాన్ని చూసినట్లు చూస్తున్నారు.

ఆ శిష్యుణ్ణి అనుసరించాను.

స్వామి వారు బస చేస్తున్న భవనంలో వారి అంతరంగిక మందిరంలోకి నన్ను తీసుకుని వెళ్ళి సోఫాలో కూర్చుండబెట్టి - "స్వామి వారొస్తారు. వేచి ఉండండి" అని చెప్పి తాను బయటికి వెళ్ళిపోయాడు.

చుట్టూ కలియ చూశాను. ఆ గదంతా ఎంతో ఖరీదుగా కనబడింది. చాలా ఖరీదైన సోఫాలు, షాండిలియర్స్ - నేలంతా కప్పిన ఖరీదైన తివాచీలు. అక్కడక్కడ అలంకరించిన ఫ్లవర్ వేజెస్. గదంతా స్ప్రే చేసినట్లుంది. కమ్మని వాసన.

నా కెదురుగా ఉన్న సోఫా పైన కృష్ణాజినం....

బహుశా అది స్వామి వారి ఆసనం కాబోలు...... ఆ ప్రక్కన రజిత పూజా మందిరం, అందులో పూజాదికమైన అమ్మవారి విగ్రహం!

నా ఆలోచనలు చిన్నగా వెనక్కు మళ్ళాయి..... విశాఖపట్నంలోని నా బాల్యం వరకు వెళ్ళాయి.

★ ★ ★

శంకరం, నేను వీధి బడి నుండి సహాధ్యాయులం. మా ఇళ్ళు కూడా దగ్గర దగ్గరే. వీధి బడి నుండి ప్రారంభమయిన మా స్నేహం హైస్కూలు, కాలేజీ చదువు వరకు అవిచ్ఛిన్నంగా సాగింది. వాడిల్లంటూ పేరుకే, ఎప్పుడూ మా ఇంట్లోనే ఉంటూ ఉండేవాడు. వాడికి మా అమ్మ దగ్గర కూడా చనువు. "అరే శంకరం! శంకరం!" అంటూ వాడంటే ఎంతో ఆప్యాయంగా ఉండేది అమ్మ.

మేము ఇంటర్ మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతుండగా - శంకరం నాన్నగారు అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదంలో పోవడంతో వాడి కుటుంబ పరిస్థితి తలక్రిందులయింది. ఆయనేదో నూనె మిల్లులో గుమాస్తాగా ఉండేవారు.

శంకరానికి ఓ చెల్లి, తమ్ముడు వున్నారు. శంకరం చదువు ఆగిపోయింది. తాను బాగా చదివి బీదరికంతో పెనుగులాడుతోన్న ఆ కుటుంబాన్ని పైకి తీసుకొని రావాలనుకొన్న శంకరం ఆశలు మధ్యలోనే కూలిపోవటంతో, వాడెంతో నిరాశ చెందాడు. ఆ పై ఆ పదహారేళ్ల వయసు నిండీ నిండని వాడు జరిపిన జీవన పోరాటం నాకు తెలుసు.

వీధి వీధి తిరిగి కాఫీ పొడి అమ్మాడు. సైకిలు కొనుక్కోగల స్తోమతు లేక ప్రొద్దునే పరుగు పరుగున వెళ్ళి ఇంటింటికీ పేపరు వేశాడు. పాకెట్‌కు పది పైసల కమీషన్‌పై డిటర్జెంటు పొడర్ పాకెట్సు అమ్మాడు. శ్రీమంతుల యిళ్లకు వాల్ పేపరు వేసి రంగులు పులిమాడు. ఇలా ఎన్నో, ఎన్నెన్నో పనులు చేశాడు. తాను తినీ, తినకా తన శరీరాన్ని యంత్రంగా మార్చి, రక్తాన్ని, చెమటను వెల కట్టుకొని

శ్రమించి ఆ కుటుంబ భారాన్ని మోసేవాడు.

కాలేజీకి వెళుతూ, వస్తూ వాడిని గమనించే వాడిని. మాసిపోయిన బట్టలతో, దుమ్ముకొట్టుకొని పోయిన ఆ జుత్తుతో, ఏదో ఒక అర్జనావ్యాపకం కోసం వెతుకు లాడుతూ కనిపించేవాడు. ఎప్పుడో వాడు కొంత అలసటను తీర్చుకొంటున్నప్పుడు మాట్లాడుకొనేవాళ్లం. నిస్సహాయతతో కూడిన ఆవేశంతో మాట్లాడేవాడు.

దేశం నానాటికి ఎలా ధనిక, బీద వర్గాలుగా విడివడిపోతోందో మాట్లాడే వాడు. శ్రమశక్తి ఎలా దోపిడీకి గురి అయిపోతుందో, ప్రభుత్వాలు, పాలకులు తాత్కాలిక ప్రయోజనాల కోసం దేశాన్ని ఎలా అమ్మేస్తున్నారో, సామాజిక న్యాయాన్ని ఎలా బలిగొంటున్నారో, కులమత ప్రాతిపదికలపై ప్రజలనెలా విభజించి పాలిస్తున్నారో ఆవేశంగా చెప్పేవాడు.

శంకరం మాటలు నిజమనిపించేవి. వాడిలోని నిజాయితీ, ఆవేశం, జీవన పోరాటంలో మరుగుపడిపోతున్నాయి కాని లేకుంటేనా అన్పించేది.

నా బి.కాం. చదువు అయిపోయింది. ఆ తరువాత కమర్షియల్ కోర్సులో డిప్లమో కూడా పూర్తి చేసి ఎలక్ట్రిసిటీ బోర్డు అకౌంట్సు బ్రాంచిలో ఉద్యోగం రావటంతో విశాఖ వదలివేయటం జరిగింది. ఆ తరువాత శంకరాన్ని కలవటం పడింది కాదు. వార్తలే తెలుస్తూ వుండేవి వాణ్ణి గురించి.

నేను కాకినాడలో ఉద్యోగం చేస్తున్న రోజులలో ఓసారి పనిమీద విశాఖ వెళ్ళాను. అప్పుడు తెలిసింది. శంకరానికేదో చాలా పెద్ద జబ్బు చేసిందట. మూడు నెలలు మంచం మీదే వున్నాడు. దానితో ఆ కుటుంబపు ఆర్థిక స్థితి మరీ క్షీణించిందట. దానితో వాడి తమ్ముడు చదువు ఆగిపోయింది. ఆ నిరాశతో వాడెటో వెళ్ళిపోయాడట.

పెళ్లికెదిగిన చెల్లాయి ఇంకా తాను ఆ కుటుంబానికి ఒక సమస్యగా మిగిలిపోలేక పెళ్ళి చేసుకొంటాననే ఒక మోసగాని వలలో చిక్కుకొని వాడితో వెళ్లి పోయిందట. ఈ పరిణామాలను భరించలేక శంకరం అమ్మగారు చనిపోయారట.

శంకరం కోసం విశాఖ అంతా వెతికాను. వాడి ఆ చూకీ తెలియరాలేదు. 'నక్సలైటుగా మారి అరకులోయల్లోను, శ్రీకాకుళం అడవి ప్రాంతాల్లోను తిరుగు తున్నాడని 'వదంతి'గా వుంది' అని చెప్పాడు మిత్రుడు రామగోపాలం.

ఒక మిత్రుడుగా శంకరానికి.... ఆ కుటుంబానికి నేనేమైనా సాయం చేయాల్సింది. అలా చేయలేకపోయానే అని బాధ పడ్డాను.

దాదాపు పది సంవత్సరాల తరువాత ఈనాడిలా శంకరం కనిపించాడు; వాణ్ణి గురించి నాకున్న అంచనాలను తల్లకిందులు చేస్తూ!

వాడిలోని నిజాయితీ, ఆవేశం, కాలపు కర్కశత్వం ముందు ఓడిపోతే - ఈ సమాజపు ధోరణిలో రాజీపడతాడేమో అనుకొనేవాణ్ణి.

కాని, వీడింత 'నయవంచన పాత్ర' ధరిస్తాడనుకోలేదు. సర్వసంగ పరిత్యాగి అవతారమెత్తి జన విశ్వాసాల మీద వ్యాపారి అవుతాడని ఊహించలేదు - నేను.

నా ఆలోచనల నుండి తేరుకొనేపాటికి..... "శ్రీశ్రీశ్రీ జ్ఞాన సచ్చిదానంద సరస్వతీ యతీంద్ర స్వామిజీ" నేనున్న గదిలోకి వచ్చారు. ఆ గది తలుపులు మూసి వారి శిష్యగణమంతా నిష్క్రమింపగా, తనను ఆసాంతమూ తేరిపార చూస్తున్న నా దగ్గరకు వచ్చి, "భాస్కరం..... ఎన్నాళ్ళకు!" అంటూ అమాంతం నన్ను తన కౌగిట్లోకి తీసికొన్నాడు.

ఆ పట్టు పీతాంబర కాషాయాలు వెదజల్లుతోన్న కమ్మని వాసనలు, ప్రియ మిత్రుని చిరకాల గాఢ పరిష్వంగన కూడా...... ఆ కౌగిలిలో లిప్త కాలం కన్నా నన్ను యిమడ్చ లేకపోయాయి. జెర్రులు ప్రాకినట్లున్న ఆ కౌగిలి నుండి విడివడ్డాను.

"ఈ సమాజం కుహనా సంస్కృతితో కుళ్ళిపోయిందని గగ్గోలు పెట్టి దానిని సంస్కరించాలని నక్సలైట్లలో చేరిపోయిన శంకరం.... స్వామీజీ అవతారమెత్తారా?" ప్రశ్నించాను, శంకరం కనులలోకి సూటిగా చూస్తూ!

శంకరం నుండి ఎలాంటి జవాబూ రాలేదు వెంటనే. ఓ మూలనున్న కుర్చీనొకదాన్ని తెచ్చి నా కెదురుగా అతి సన్నిహితంగా వేసుకొని కూర్చొని క్షణ కాలం మౌనంగా వుండిపోయాడు.

"శంకరం!" ఈసారి చాలా చల్లగా ప్రశ్నించాను - "ఏమిటీ మోసం?" అని.

శంకరం, చిన్నగా తలపైకెత్తి, "భాస్కరం! నే చెప్పవలసింది చాలా వుంది. విను. ఆ తర్వాత నీవేమైనా అను" అంటూ ప్రారంభించాడు.

"అమ్మను, చెల్లిని, తమ్ముణ్ణి బ్రతికించుకోవటానికి నేనెన్నిపాట్లు పడ్డానో నీకు తెలుసు. బహుశా ఈ మానవ సమాజానికి తెలిసిన అన్ని జీవన మార్గాలలోను

ప్రయత్నించాను. శరీరాన్ని దాచుకోకుండా రాత్రింబవళ్ళు శ్రమించాను. రెండు పూటలా సరిపడ పట్టెడు మెతుకులు ఆర్జించుకోవటానికి చెమటోడ్చాను. రక్తం ధారపోశాను..... కాని దారుణంగా ఓడిపోయాను.

"తన చదువు ఆగిపోయిన నిరాశతో తమ్ముడు ఎటో వెళ్ళి పోయాడు. చెల్లి అలా అయిపోయింది. అమ్మ చనిపోవటం గురించి నీకు సరిగా తెలియదు. అమ్మ చనిపోలేదు. ఆ దరిద్రాన్ని, అవమానాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకొంది.

"ఆ స్థితిలో నేను చేయగలిగింది. ఈ సమాజం మీద తిరగబడటమే అనిపించింది. ఆ మార్గాన్ని బట్టి నక్సలైటు ఉద్యమకారుల మధ్య కురికాను.

"- కాని.... అదో అంధకార బంధుర ప్రపంచం అని తెలుసుకోవటానికి ఎక్కువ సమయం పట్టలేదు. బయట వున్న స్వార్థం, మోసం, దగా, దోపిడీల నుండి పారిపోయానని భావించానే కాని, అక్కడ నాకు కనిపించినవి, పగ, ద్వేషం, క్రౌర్యం మాత్రమే!

"ఎందుకు, ఎవరిని కిడ్నాప్ చేస్తున్నామో తెలియదు. ఎవరిని ఎందుకు చంపుతున్నామో తెలియదు. ఎవరినో సాధించటానికి మరెవరినో కిడ్నాప్ చేయటం; ఏ అమాయకుడినో చంపివేయటం; ఎందుకు బస్సులను తగుల పెడుతున్నామో..... ఎందుకు రైళ్ళను కూల్చివేస్తున్నామో అంతా అగమ్య గోచరం. వర్గ పోరాటం పేర మారణహోమం! అదో రాక్షసానందం.

"ప్రక్కవాడెప్పుడు పారిపోయి, ఇన్‌ఫార్మరవుతాడో అనే అవిశ్వాసం; అదో భయంకర భయద వాతావరణం. అక్కడా ఉండలేకపోయాను.

"ఇక్కడి నుండి అక్కడికి పోయినంత సులువు కాదనిపించింది, అక్కడి నుండి బయట పడటం. ఎలాగో కొందరు గోసాయిలలో కలసిపోయి ఒరిస్సా తీరానికి, అటునుండి మధ్యప్రదేశ్ అడవులకు, ఆపై సభ్య ప్రపంచంలోకి అడుగిడ కల్గాను.

"ఆ గోసాయి ఉడుపులలో ఒక గ్రామ పరిసరాలలో ఓ చెట్టు క్రింద విశ్రమించి, భవిష్యత్తును గురించి ఆలోచించుకొంటున్న నా చుట్టూ ఆ గ్రామస్తులు చేరి - "స్వామీజీ!" అన్నారు. ఫలాలు తెచ్చారు. పానీయాలు సమర్పించారు. నేను వాటిని స్వీకరించాను అనేకంటే.... ఆకలి వాటిని అంగీకరించింది అనటం సబబు.

ఆనాటి నుండి ఎందుకు వచ్చేవారో ఆ గ్రామ ప్రజలు నా చుట్టూ చేరేవారు. పాలు, పండ్లు, ఫలహారాలు తెచ్చేవారు. నేను వాటిని స్వీకరించానని సంతోషించే వారు.

"చిన్నగా ఆ గ్రామ ప్రజలే కాదు. ప్రక్క పల్లెల వారు, దూర గ్రామాల వారు, తండోపతండాలుగా రావటం ప్రారంభించారు. వారి భాష సరిగా రాక మౌనంగా ఉన్న నన్ను 'మౌన స్వామీజీ' అన్నారు. 'యతీంద్రులు' అన్నారు. ఇంకా ఎన్నో అంటగట్టారు.

"స్వామీజీ మహిమాన్వితులు. వారి దర్శనంతో మానసిక శాంతి చేకూరు తుంది. వారి స్పర్శచే సర్వరోగాలు హరిస్తాయి, అనే వార్తలు దావానలంలా వ్యాపించాయి.

"అన్నీ వారే అన్నారు. నేనుగా ఏమీ అనలేదు. ఈ శరీరాన్ని యంత్రంలా చేసి అహోరాత్రులు చాకిరి చేసిననాడు, పట్టెడు మెతుకులు ఆర్జించలేకపోయాను. నిర్వ్యాపారిగా కూర్చొన్న నాడు సర్వం నా దగ్గరకు వస్తున్నాయి. ఆ ఒక్క విషయానికి ఆశ్చర్యపోతూ ఉండి పోయానంతే!

"అక్కడ నాకో పర్ణశాల నెలకొల్పారు. దాన్నే ఆశ్రమంగా దిద్దితీర్చారు. అనతి కాలంలోనే అదో యాత్రాస్థలంగా మారిపోయింది. శిష్యులు ఏర్పడ్డారు. అతిదూర ప్రాంతాల నుండి సైతం భక్తులు చిన్న కార్లలో, టూరిస్టు బస్సులలో నా దర్శనార్థం వచ్చి 'క్యూ'లలో నిలువబడటం ప్రారంభించారు.

"నాకు, కలలా విచిత్రంగా కనిపించిందంతా. 'మీకేమి కావాలి?' అని ప్రశ్నించాను.

"తరుణోపాయం కావాలట. చూపమని ప్రాధేయపడ్డారు. దేని నుండి తరుణోపాయమో అర్థం కాలేదు నాకు. మిన్నకుండిపోయాను. 'స్వామి అనుగ్రహించలేదు' అనుకొన్నారు.

"ఓసారి ఓ మాజీ సంస్థానాధీశుడు వచ్చి దగ్గరలో ఉన్న పట్టణంలో తన భవనానికి దయచేయమని వేడుకొన్నాడు. వెళ్ళాను. నా దర్శనంతో, ఎన్నో ఏళ్ళుగా రోగ గ్రస్త అయిన ఆయన రాణిగారికి స్వస్థత చేకూరిందట, నన్నక్కడే ఉండమని కోరాడు. అధునాతనమైన ఏర్పాట్లతో తన భవనాన్ని ఆశ్రమంగా మార్చి సమర్పించు

కొన్నాడు. ఆశ్రమానికి కొన్ని లక్షలతో ఒక ట్రస్టు ఏర్పరచాడు.

"ఎలా అయ్యానో నాకు తెలియదు. 'శ్రీ జ్ఞాన సచ్చిదానంద సరస్వతీ యతీంద్ర స్వామిజీ' నయ్యాను. ఎవరో అన్నారు. అంతే!

"ఆశ్రమానికి కానుకలు సమర్పించుకొనే వారిలో, ఎందరో చేరారు. సామాన్య ప్రజలే కాదు; ధనికులు, మాజీ సంస్థానాధీశులు, పారిశ్రామిక వేత్తలు, దేశ నాయకులు, మంత్రులు, ఎందరో! మరో మహారాజా వారు స్వామీజీ వారి దేశ పర్యటనకు ఒక 'పాంటియాక్' కారు నిచ్చారు.

"ఆశ్రమ ఆదాయం వేల నుండి, లక్షలకు పెరిగి పోయింది. అలాగే స్వామీజీ కీర్తి ప్రతిష్ఠలు రాష్ట్ర స్థాయి నుండి దేశ, విదేశీ స్థాయిలకు ఎదిగిపోయింది."

చెప్పటం ఆపాడు శంకరం.

నా కనులలోకి చూస్తూ, 'నీలో చెలరేగుతోన్న ప్రశ్న నాకు తెలుసు. ప్రజలను 'స్వామీజీ' నే అని ఎందుకు మోసం చేశావు?' అని కదూ నీ ప్రశ్న? అది నీ ప్రశ్నే కాదు. నన్ను నేనేసుకొన్న ప్రశ్న కూడా అదే! భాస్కరం! నా సమాధానం ఎవరూ నమ్మకపోవచ్చు. కాని నీవు...నీవు నమ్ముతావని చెపుతున్నాను. నన్ను నేను నిజాయితీగా... ఆత్మసాక్షిగా శోధించుకొని తేల్చుకొన్న జవాబిది. నే నెవ్వరినీ మోసం చేయలేదు. వారంతట వారే మోసపోయారనీ అనలేను. మోసం చేయటం, మోసపోవటం అనే విషయాలను పరిశీలిద్దాం. స్వార్థాన్ని ఆశించి ఒక వ్యక్తి మరొకరిని ప్రలోభ పెట్టి వంచించటం మోసం చేయటం అవుతుంది. నే నలాంటిది చేయలేదు.

"అలాగే ఎదుట వారి మాటలు నమ్మి భ్రమించి, తమది కోల్పోవటం మోసపోటం. అలాంటిది లే దిక్కడ. వారు 'స్వామీజీ' నుండి చిత్తశాంతిని ఆశించారు. వారి కది దక్కిందనే తృప్తి పొందుతున్నారు.

"నీకు నేనేదో బోధించటానికి సాహసిస్తున్నాను అనుకోకుంటే ఒక్క విషయం చెప్పనా? సుఖమంటే ఏమిటి? ఆకాశ హర్మ్యాలలో, ఎయిర్ కండిషన్డ్ ప్రాసాదాలలో విహరించి నిద్రించటమా? కాలు నేల మోపక సొంత విమానాలలో తిరగటమా? ధన రాసులతో తులతూగటమా? ఏమిటి?

"తగలపెట్టుకొన్నా తర తరాలః వరకు తరగని ధనరాసులున్న వారినీ

చూచాను, బంగారు పళ్లెరాలలో షడ్రసోపేతమైన తిండి తినే వారినీ చూచాను. రంభల్లాంటి భార్యలున్న వారినీ, కన్ను మెదిపితే సర్వసేవలు చేసే పరిజనులున్న వారినీ చూచాను. కానీ వారంతా తాము సుఖంగా లేమని వాపోయారు. మనసుకు ప్రశాంతత కావాలని వెతుక్కొంటూ ఆశ్రమంలోకి వచ్చి 'ఆశ్రయం' పొందారు.

"సుఖం అనేది విచిత్రమైనది. ఆశ్రమంలో కటిక నేలపై పరుండి; పచ్చి కూరలు తిని, ఒంటరి జీవితాలను అనుభవించే వారంతా తృప్తిగా వున్నారు.

"సుఖం అనేది పామరంగా మనం అనుకొంటున్న ధన కనక, మణి, మాణిక్యాలలో లేదు. 'మానసిక శాంతి'లో వుంది. తృప్తి పొందటంలో వుంది."

శంకరాన్ని ఆపి ప్రశ్నించాను, "అలాంటి శాంతిని, తృప్తిని ఈ ప్రజా సందోహానికి నీవు ప్రసాదించాననంటావు?"

"నేను ప్రసాదించానననటం లేదు. వారు పొందుతున్నారు. అది భ్రాంతి కావచ్చు. ఏమైతేనేం? ఈ సిరిసంపదలు, పదవులు, భోగభాగ్యాలు అన్నీ భ్రాంతులే! వేదనలో ముంచెత్తే భ్రాంతి కంటే వేదనను ఉపశమింప చేసే భ్రాంతులు మంచివి కదా! ఇంతకూ నే చెప్పదలచింది వారు నాచే వంచింపబడటం లేదని.... నేను వారిని వంచించటం లేదని..." అన్నాడు శంకరం.

"పోనీ.... ఈ వ్యాసంగంలో నీవు సాధించిదేమిటి?" తెలివిగా మాట్లాడుతున్న శంకరాన్ని బంధించినట్లు ప్రశ్నించాను.

శంకరం కొన్ని క్షణాలు అరమోడ్పు కన్నులతో నిలచిపోయి జవాబిచ్చాడు.

"సాధించాననే అనుకొంటున్నాను. ముఖ్యంగా ఈ సమాజంపై తిరగబడి ఏదో ప్రతీకారం చేయాలనే కోపాన్ని, పగను, ద్వేషాన్ని నా నుండి తొలగించు కోగల్గాను. సృష్టించవలసినది బీభత్సాన్ని కాదు; ప్రశాంతిని నెలకొల్పగలగాలి - అని గ్రహించాను. దగా పడిన తమ్ముడు, మోసపోయిన చెల్లి, నిస్సహాయురాలైన అమ్మ జ్ఞాపకాని కొచ్చేవారు. అలాంటి వారి నెందరినో చూచాను -'స్వామీజీ'గా.

"ఆశ్రమ ఆదాయం నుండి ఉచిత విద్య నిచ్చే పాఠశాలలు, కాలేజీలు ప్రారంభించాను. విద్యార్థులకు ఎందరికో స్కాలర్ షిప్పులను కులమతాలకు అతీతంగా ఏర్పాటు చేయించాను.

"అనాధలకు, విధవలకు, త్యజితలకు - మోసపోయి పతితలైన వారికి

వృత్తులను నెలకొల్పి వారు వారి కాళ్ళపై నిలబడి పోషించుకొనే స్థితిని కల్పించే 'ఇన్‌స్టిట్యూట్స్' నెలకొల్పించాను ఆశ్రమ నిధుల నుండి. నిరాధారమైన వృద్ధులకు, నిరాదరణకు గురి అవుతోన్న వారికి 'వృద్ధ గృహా'లను నెలకొల్పి ఉచిత పోషణ, వైద్య సదుపాయం లభించేలా ఏర్పాట్లు కల్పించాను.

"భాస్కరం! శంకరంగా రాత్రింబవళ్ళు శ్రమించి ఒక చిన్న కుటుంబాన్ని సుఖ శాంతులతో వుంచలేకపోయిన నేను ఈ "స్వామీజీ"గా ఎన్నో కుటుంబాలకు సుఖ శాంతులను సమకూర్చగలిగాను. నాకు తెలుసు, నా పాత్ర చాలా నిమిత్త మాత్రమయినదనీ - యాదృచ్ఛికమైనదనీను. కాని..... ఈప్రపంచమెల్లా ఒక 'రంగస్థల' మైతే, ఆ రంగస్థలంపై కొందరు కొన్ని పాత్రలకే నప్పినట్లు నేను శంకరం పాత్రలో కంటే స్వామీజీ పాత్రలోనే రాణించానేమో!" శంకరం తాను చెప్పదలచుకొన్నది అయిపోయినట్లు ఆగిపోయాడు.

గంట క్రితం స్వామిజీ రూపంలో శంకరాన్ని చూచిన క్షణం నుండి, గోరూపం ధరించిన తోడేల్లా ఈ శంకరం అనిపించిన భావం, నీట ముంచిన ఇసుక పాత్రలా కరగిపోయింది. శంకరం 'జ్ఞాన' సచ్చిదానంద సరస్వతి లాగానే కన్పించాడు. 'కరుణ'లా గోచరించాడు. 'సత్యం'లా ప్రకాశమానంగా మిరుమిట్లు కొల్పాడు. అసంకల్పంగా లేచి శంకరాన్ని కాదు, స్వామీజీని - కౌగలించుకున్నాను.

"నేను ధనరూపమైన కానుకలను సమర్పించుకోలేనేమో! కానీ.... నీ పూర్వాశ్రమ స్మృతికి ఓ అపూర్వమైన కానుకను సమర్పించుకోగలను-" అన్నాను శంకరం కౌగిలి నుండి తేరుకొని.

కించిదాశ్చర్యంగా చూచాడు శంకరం, నాకేసి. మూసి ఉన్న ఆ గది తలుపు తట్టి బయట వేచి ఉన్నవారిని పిలిచి అడిగాను - "సభాస్థలిలో ఎవరైనా వున్నారా?" అని.

"అందరూ వెళ్ళిపోయారు. మీ కుటుంబ సభ్యులట, విశ్రాంతి మందిరంలో వేచి ఉన్నారు" అని చెప్పారు వాలంటీర్లు.

"వారిని తీసి కొనిరండి" స్వామీజీ ఆనతిగా చెప్పాను.

అప్పుడడి గాడు శంకరం - "మీ అమ్మ, చెల్లి కులాసా" అని.

"ఆc! అమ్మ, చెల్లి, వారితోపాటు నా భార్య కూడా" అన్నాను.

ఆపై మా సంభాషణ కొద్దిసేపు నాటి శంకరం - భాస్కరం మధ్య సాగినట్లే సాగింది.

"తమ్ముడు శీను అయిదు సంవత్సరాల క్రితం ఓ యాత్రికుల టూరిస్టు బస్సు డ్రైవరుగా ఆశ్రమానికి వచ్చినపుడు కనిపించాడు. ఆశ్రమంలోనే వుండి పోయాడు. "రాంచీ" సమీపాన కుష్ఠు వ్యాధి పీడితుల కోసం ఆశ్రమం నెలకొల్పిన వైద్యసేవా శిబిర నిర్వహణలో పాలుపంచుకొంటున్నాడు" అని చెప్పాడు శంకరం.

"శీను కన్పించాడా?" ఆనందించాను.

అంతలోనే అమ్మ, గాయత్రి, జానకి లోపలకు వచ్చారు.

"అమ్మా! స్వామీజీ ఎవ్వరో చూడు" అన్నాను.

క్షణ కాలం సంభ్రమాశ్చర్యాలు ముప్పిరిగొనగా- "శంకరం! నీవా....?" అంటూ అమ్మ; "అన్నయ్యా!" అంటూ జానకి ఆనందపారవశ్యంతో మునిగి పోయారు.

శంకరం దిగ్భ్రాంతి చెందినట్లు జానకినీ - నన్నూ మార్చి మార్చి చూస్తూ ఉండిపోయాడు.

"అవును నేను నీకు నీ పూర్వాశ్రమ స్మృతి కానుకను సమర్పిస్తానన్నది - నీ చెల్లి జానకినే, నా భార్య హోదాలో!" అన్నాను.

మేము మాత్రమే ఉన్న ఆ గదిలో ఆనందాశ్రువుల మధ్య - పూర్వస్మృతులు నెమరు వేసుకుంటుండగా ఓ గంట కాలం కరగి పోయింది.

"ఇక వస్తాము" అంటూ లేచాము.

శంకరం అమ్మకు నమస్కరించాడు. గాయత్రిని "కల్యాణమస్తు" అంటూ దీవించాడు. జానకిని కౌగిలించుకొని..... అక్కడే ఉన్న అమ్మవారి ప్రతిమ ముందున్న కుంకుమను నుదుటదిద్ది..... "సుమంగళీభవ" అన్నాడు.

నా దగ్గరకు వచ్చి రెండు చేతులూ పట్టుకొని, "భాస్కరం! తెలిసి తెలిసి ఒక్కోసారి మనసు మాయతో కప్పుకు పోతుంది. అలాంటి బలహీన క్షణాలలో నేను స్వామీజీనే నేమో అనే భ్రమకు లోనయ్యే వాడినేమో! నీలాంటి వారి అవసరం అలాంటి క్షణాలలోనే కావలసి ఉంటుంది" అన్నాడు.

శంకరం అనేదేమిటో అర్థంకాక, "ఏమిటి?" అన్నాను.

"నా ఆసేతుహిమాచల పర్యటనలో ఎందరినో మహనీయుల్ని దర్శించాను. ఈ రోజు మరో 'కర్మయోగిని'- నిన్ను చూశాను. నిజంగా ధన్యుణ్ణి" అన్నాడు. శంకరం కనులలో రెండు అశ్రుకణాలు.

"నీకు పుణ్యం ఉంటుంది. నీ చెల్లి కాపురం నిలపెట్టటానికైనా సరే, నన్ను యోగిని చేయకు-" అన్నాను.

★ ★ ★

స్వామీజీ కబురు టెలిగ్రాము ద్వారా అందుకున్న 'శీను' నాలుగవ నాటి కల్లా వచ్చాడు. మా యింట్లోనే ఉన్నాడు.

పది రోజుల తర్వాత స్వామీజీ పరివారంతో సహా తమ ఆశ్రమానికి తిరిగి వెళ్లారు. శీను, గాయత్రి రాంచి సమీపాన ఉన్న కుష్ఠురోగుల వైద్య సేవా శిబిర నిర్వహణకు వెళ్ళిపోయారు జంటగా. ●

## కథ వెనుక కథ :

*నాకు చాల దగ్గరి వాడొకడు; బ్రతుకు రథం ఈడ్చటానికి, పడరాని పాట్లు పడటం తెలుసు. అయినా గొర్రె తోకలా వుండేది వాడి ఆర్జన.*

*ఎలా వచ్చిందో ఆ ఆలోచన. శ్రీ చక్ర ప్రబోధ పరిషత్ (సరిగ్గా ఈ పేరు కాదేమో) అంటూ ఓ సైన్ బోర్డు వెలయించి, చిన్న సైజు స్వామీజీ వేషధారణతో, ప్రశ్నలు చెప్పటం, యంత్రాలు కట్టటం శాంతులు జరిపించటం ప్రారంభించాడు.*

*వాడన్నమాటే - "నిజాయితీగా, ఎంతగా శ్రమించినా సాగని జీవన రథం, ఈ స్వామీజీ రూపంలో జన విశ్వాసాల మీద సాగిస్తోన్న ఈ విన్యాసం మూలంగా కించిత్ శ్రమ లేకుండా, దర్జాగా, గౌరవంగా సాగిపోతోంది -" అని.*

*పై వాడి మాటలు ఈ కథ వ్రాయటానికి ప్రేరణ అయినా సాధు జీవనం గడుపుతున్న కొద్దిమంది నిజ స్వామీజీల జీవన సరళి - వారు మానవాళికి చేస్తున్న సేవ కూడ ఈ కథకు స్ఫూర్తి.*

★ *(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 30-10-1991)* ★